క్లుప్తంగా

జగనన్న పోరుబాటపై రేపు సన్నాహక సమావేశం

చీమకుర్తి రూరల్: పొగాకు రైతులకు గిట్టుబాటు ధరల కోసం ఈ నెల 28వ తేదీ పొదిలి పొగాకు వేలం కేంద్రంలో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించనున్న పోరుబాట కార్యక్రమంపై ఈ నెల 25 తేదీ సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ చీమకుర్తి మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు కిష్టిపాటి శేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీమకుర్తి పట్టణంలోని బూచేపల్లి కళ్యాణ మండపంలో నిర్వహించనున్న సన్నాహక సమావేశానికి వైఎస్సార్ సీపీ శ్రేణులంతా హాజరుకావాలని కోరారు. ముఖ్య అతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి మేరుగు నాగార్జున హాజరవుతారని తెలిపారు. చీమకుర్తి మండలంలోని పార్టీ ముఖ్య నాయకులు, పట్టణ, మండల కమిటీ సభ్యులు, అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు, కార్యకర్తలంతా హాజరై సన్నాహక సమావేశం, జగనన్న పోరుబాట కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఒంగోలులోనే ట్రిపుల్ ఐటీని కొనసాగించాలి

ఒంగోలు టౌన్: ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను ఒంగోలులోనే కొనసాగించాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తక్షణమే రావ్ అండ్ నాయుడు క్యాంపస్ అద్దె బకాయిలు చెల్లించాలని, తరగతులను ఇక్కడే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం కోట్లల్లో బకాయిలు పెట్టడంతో కాలేజీ యాజమాన్యం నగర పాలక సంస్థకు పన్నులు చెల్లించలేకపోయిందన్నారు. దీంతో నగర పాలక సంస్థ మంచినీటి సరఫరా నిలిపేసిందన్నారు. ప్రభుత్వం తన తప్పిదాన్ని కప్పిపుచ్చుకుంటూ కాలేజీ యాజమాన్యం మీద క్యాంపస్ ఖాళీ చేయమన్నట్లు చెప్పడం సాకు మాత్రమేనన్నారు. ఒంగోలులో చదువుకుంటున్న 1300 మంది విద్యార్థుల్లో ఇడుపులపాయ, నూజివీడుకు తరలించడం సరైన చర్య కాదన్నారు. దీంతో విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారని, తలిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు.

ప్రతిఒక్కరూ యోగా చేసేలా చూడాలి

- ఎంపీడీవో డీఎస్‌వీ ప్రసాద్

మద్దిపాడు: గ్రామాల్లోని ప్రతిఒక్కరూ యోగా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో డీఎస్‌వీ వరప్రసాద్ సూచించారు. జూన్ 21వ తేదీ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 1 నుంచి 21వ తేదీ వరకు ప్రతి గ్రామంలో ప్రజలు యోగా చేసేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారని తెలిపారు. ఈ క్రమంలో ప్రతి గ్రామంలో సర్వే నిర్వహించి విశాఖపట్నంలో ప్రధానమంత్రి మోదీ పాల్గొనే కార్యక్రమంలో పాల్గొనే వారి జాబితా తయారు చేయాలని చెప్పారు. సచివాలయ పరిధిలో యోగా చేయడానికి ఇష్టపడే వారిని సంబంధిత యాప్లో నమోదు చేయాలని కార్యదర్శులను ఆయన ఆదేశించారు. మండల పరిధిలో వివిధ సచివాలయాల నుంచి 200 మందిని ఎంపిక చేయాలని సూచించారు. వారికి ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు ఐదు రోజులపాటు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ పొందిన వారు గ్రామాల్లో ఒకటో తేదీ నుంచి ప్రతిరోజూ ఉదయం 7 నుంచి 8 గంటల వరకు యోగ తరగతులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. సచివాలయ సిబ్బంది ప్రతిఒక్కరూ ఈ సర్వేను కచ్చితంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు.

రైతులకు అండగా వైఎస్సార్ సీపీ

- పార్టీ అధినేత వైఎస్ జగన్ పొదిలి పర్యటనను జయప్రదం చేయాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న వెంకాయమ్మ, వేదికపై ఎమ్మెల్యే బూచేపల్లి

కురిచేడు: పొగాకు రైతులకు భరోసా కల్పించేందుకు జగనన్నతో కలిసి అడుగులో అడుగేసి రైతన్నకు చేయిచేయి కలిపి చేదోడుగా ఉండేందుకు ఈ నెల 28న పొదిలి రావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక శ్రీవాణి కళ్యాణ మండపంలో శుక్రవారం ఆయన దొనకొండ, కురిచేడు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలిలోని పొగాకు బోర్డును సందర్శించి రైతుల కష్టాలు నేరుగా తెలుసుకోనున్నట్లు చెప్పారు. అందులో ప్రతి కార్యకర్త, నాయకుడు భాగం కావాలని కోరారు. ఎవరికి ఏ కష్టమొచ్చినా, ఎన్ని కష్టాలొచ్చినా వెనకడుగు వేయక మీ వెంటే మేమంతా అంటూ చాటి చెప్పాల్సిన అవసరం ఆసన్నమైందని పేర్కొన్నారు. కరోనా కష్టకాలంలో కూడా ఇచ్చిన హామీలు నూటికి నూరు శాతం అమలు చేయడంతో పాటు ఇవ్వని హామీలను, ప్రజల అవసరాలను గుర్తించి వారి ముంగిటకు అధికారులను పంపి సేవలందించి అందరి ముఖాల్లో ఆనందాన్ని చూసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి మాత్రమేనన్నారు. పొగాకు రైతుల మేలు కోసం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మార్క్‌ఫెడ్‌ద్వారా పొగాకు కొనగోలు చేయించి మంచి ధరలు ఇప్పించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పొగాకు, మిరపకాయలు తమకు సంబంధం లేదని తప్పుకుంటున్నారని, హైయర్ గ్రేడ్ పొగాకు బేళ్లు కూడా వెనక్కు పంపుతున్నారని బూచేపల్లి విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు కష్టాలేగానీ ఏ ఒక్కరూ ఆనందంగా ఉన్న దాఖలాలు లేవని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో అబద్ధాల హామీలు వండి వార్చి మోసపూరితంగా గద్దెనెక్కిన కూటమి నేతలు ప్రజలు సంక్షేమం గాలికి వదిలి కక్ష్య సాధింపులే పరమావధిగా పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ఈ ఏడాది రాష్ట్రంలో ఏ ఒక్కరూ సుఖసంతోషాలతో ఉన్న దాఖలాలు లేవని, తిరిగి జగనన్న ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. కక్ష సాధింపులు, పగ ప్రతీకారాలు పక్కన పెట్టి ఇచ్చిన హామీల అమలు, ప్రజాసంక్షేమం దిశగా పరిపాలన కొనసాగించాలని హితవు పలికారు. రెడ్‌బుక్ ఒక్కటే వారికి ఉందని, జగనన్న 2.0 ప్రతి గ్రామంలో ఉందని బూచేపల్లి గుర్తుచేశారు.

రైతుల బాధలు రైతులకే తెలుసు: బూచేపల్లి వెంకాయమ్మ

రైతుల బాధలు రైతు కుటుంబాల్లోని వారికే తెలుస్తాయని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులు ఆనందంగా ఉన్నారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో పంటలకు గిట్టుబాటు ధరలు లేవని, పంట సాయం లేదని, ఉన్న పింఛన్లు తొలగించేందుకు బతికున్న వారు చనిపోయినట్లు రికార్డులు మార్చి పింఛన్లు తొలగిస్తున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను ఇబ్బందులు పెడుతున్నారని, అన్నీ గుర్తు పెట్టుకుంటామని వెంకాయమ్మ హెచ్చరించారు. ఎవరికీ భయపడవద్దని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. పొదిలి కార్యక్రమం విజయవంతం చేయాలని ఆమె కోరారు. సమావేశంలో పార్టీ మండలాల కన్వీనర్లు కాకర్ల కృష్ణారెడ్డి, వైవీ సుబ్బయ్య, దొనకొండ ఎంపీపీ ఉషామురళి, కురిచేడు జెడ్పీటీసీ నుసుం వెంకటనాగిరెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గోగులమూడి లింగారెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి బీవీ సుబ్బయ్య, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుంటు పోలయ్య, నియోజకవర్గ ఇంటలెక్చువల్ వింగ్ అధ్యక్షుడు వీరగంధం కోటయ్య, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు మేరువ సుబ్బారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కె.రమణ, వాణిజ్య విభాగం కన్వీనర్ పి.సాంబశివరావు, దొనకొండ, కురిచేడు ఎంపీటీసీలు కసిబిసి నాగరాజు, అచ్చయ్య, నాగేశు, బుల్లం వెంకట నర్సయ్య, కానాల శివారెడ్డి, కురిచేడు వైస్ ఎంపీపీ అన్నెం అరుణ, జిల్లా సాంస్కృతిక విభాగం మాజీ అధ్యక్షుడు సైదా, సర్పంచ్‌లు, సొసైటీ ప్రెసిడెంట్లు, మాజీ మండలాధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు

జీవనోపాధి కల్పించాలి


ఎమ్మెల్యే బూచేపల్లికి వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూలు

దర్శి (కురిచేడు): అర్ధంతరంగా ఎండీయూలను ప్రభుత్వం తొలగించడంతో జీవనోపాధి కోల్పోయామని, జీవనోపాధి కల్పించాలని యండీయూలు దర్శి శాసనసభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయనకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. 90 శాతం రాయితీతో నాలుగు చక్రాల వాహనం అందజేశారని, 72 నెలల అగ్రిమెంట్ ఇచ్చామని, ఇంకా 19 నెలలు మిగిలి ఉందని గుర్తు చేశారు. కాంట్రాక్టు ప్రకారం మిగిలిన 19 నెలలు కొనసాగించేలా ప్రభుత్వానికి విన్నవించాలని కోరారు.

అభయాంజనేయ స్వామికి నగరోత్సవం

ఒంగోలు మెట్రో: నగరంలోని మంగమూరు డొంక మర్రిచెట్టు కాలనీలో వెలసిన పొలిమేర అభయాంజనేయ స్వామి దేవస్థానంలో శుక్రవారం ఉదయం అర్చక స్వాములు సహస్రనామావళి దళార్చన సీతారామ అష్టోత్తర శతనామ పూజ చేశారు. సువర్చల అభయాంజనేయ స్వామి వారి పూజా క్రతువులను, మంగళ హారతులను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం భక్తులకు స్వామి తీర్థప్రసాదాలు పంచారు. సాయంత్రం ఆరు గంటలకు దేవస్థానం నుంచి వివిధ రకాల పుష్పాలతో చక్కగా అలంకరించిన గజ వాహనంపై స్వామి వారి నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. దేవస్థానం నిర్వాహకులు, ఆలయ ప్రధాన అర్చకులు పరాంకుశ రంగాచార్యులు, పరాంకుశ సమీర్ పాల్గొన్నారు.


గజవాహనంపై పొలిమేర అభయాంజనేయస్వామి

వంద మందికి ఉచిత కంటి పరీక్షలు

చీమకుర్తి: చీమకుర్తిలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో వంద మందికి కంటి పరీక్షలు చేశారు. విరాట్ స్టూడియో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య, లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీ జవహర్ ప్రారంభించారు. డాక్టర్లు ఆదిమూలం రాఘవాచార్యులు, విజయ సుధాకర్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో గుండా శ్రీనివాసరావు, పుత్తూరి ఆంజనేయులు, పూర్ణచంద్రరావు, రామకృష్ణ, స్థానికులు పాల్గొన్నారు.


కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ రామకృష్ణయ్య,డాక్టర్ జవహర్

పోలేరమ్మ తల్లికి జలాధివాసం

దర్శి (కురిచేడు): అద్దంకి రోడ్డులో వేంచేసి ఉన్న పోలేరమ్మ తల్లి, బొడ్డురాయిస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళలు పోలేరమ్మ తల్లికి జలాధివాసం చేశారు. ఉదయం నుంచి మహిళలు భక్తితో బిందెలతో నీరు తీసుకుని వెళ్లి అమ్మవారికి జలాధివాస అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి పరంకుశ కృష్ణచైతన్య మాట్లాడుతూ పోలేరమ్మ తల్లి ఉత్సవాలు ఈ నెల 20వ తేదీ నుంచి జరుగుతున్నాయని తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల వరకు జలాధివాసం కార్యక్రమం జరుగుతుందని, సాయంత్రం 4 గంటలకు అమ్మవారి గ్రామోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. ఆలయ ధర్మకర్త కన్నా రమణారెడ్డి, కమిటీ సభ్యులు భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు.


జలాధివాసం చేస్తున్న మహిళలు

నల్లబర్లీ పొగాకు అంచనాకు సహకరించాలి

సాక్షి ఎఫెక్ట్..

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని నల్లబర్లీ పొగాకు మోతాదు అంచనా వేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు మండల వ్యవసాయాధికారి ఎండీ ఫరూఖ్ తెలిపారు. గురువారం సాక్షి దినపత్రికలో బర్లీ పొగాకు ధర పతనం శీర్షికతో ప్రచురించిన కథనానికి స్పందించిన ప్రభుత్వం బర్లీ పొగాకు రైతుల వద్ద ఎంత మోతాదులో ఉందో అంచనా వేయాలని ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని వ్యవసాయ సహాయకులను నల్లబర్లీ సాగు చేసిన గ్రామాల్లో రైతులను కలిసి వారి వద్ద ఉన్న పొగాకు మోతాదు అంచనా వేసి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. మండలంలోని ఉల్లగల్లు, పసుపుగల్లు, పోలవరం గ్రామాలతో పాటు నల్లబర్లీ సాగు చేసిన రైతులు ఆర్ఎస్‌కే సిబ్బందికి తమ వివరాలు ఇచ్చి పొగాకు అంచనా నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతుల వివరాలు ఏపీఏఐఎంఎస్ యాప్‌లో నమోదు చేస్తే ప్రభుత్వం ఆ వివరాలతో తగు చర్యలు తీసుకునేందుకు సహాయ పడుతుందని చెప్పారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ఆంజనేయులు, ప్రదీప్, నరేంద్ర పాల్గొన్నారు.


నల్లబర్లీ పొగాకు అంచనా నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

యూటీఎఫ్ ఆధ్వర్యంలో బదిలీల హెల్ప్ డెస్క్

ఒంగోలు సిటీ: ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన ఒంగోలు యూటీఎఫ్ భవనంలో సహకార కేంద్రాన్ని (హెల్ప్‌డె స్క్) ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డి.వీరాంజనేయులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉన్నా ఆన్‌లైన్ దరఖాస్తు సబ్మిషన్ చేసేందుకు, వెబ్ అప్షన్ కోసం సర్వీసును అందజేయనున్నట్లు పేర్కొన్నారు. బదిలీలు పూర్తయ్యేవరకు సహాయ సహకారాలు, మార్గదర్శకత్వం వహిస్తుందని తెలిపారు. జిల్లా ఐటీ సెల్ విభాగాన్ని పదిమంది టీం సభ్యులతో ఏర్పాటు చేశామని చెప్పారు. ఉపాధ్యాయులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్‌లకు సంబంధించిన సమస్యలను జిల్లా నాయకత్వం జిల్లా విద్యాశాఖాధికారితో మాట్లాడానికి, పరిష్కరించేందుకు ఒక ప్రత్యేక మైన టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా సహాధ్యక్షురాలు జి.ఉమామహేశ్వరి, జిల్లా కోశాధికారి ఎస్.చిన్నస్వామి, జిల్లా కార్యదర్శులు ఎం.బాలరాజు, ఎం.సంధ్యారాణి, శుద్ధపల్లి ప్రసాద్, డీవీ జనార్ధన్ ,వై.వెంకటరావు, కేవీ నరసింహారావు, బి.సోమసుందరరావు, పి.శ్రీనివాసులురెడ్డి, ఆర్. నారాయణ, పాల్గొన్నారు.


హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యం



ఒంగోలు టౌన్: జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. స్థానిక ఎంఎస్ ఫంక్షన్ హాలులో శుక్రవారం ఏపీడబ్ల్యూజేఎఫ్ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు జిల్లా ఎమ్మెల్యేలుగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా షేక్ చిన్న కరీముల్లా, ప్రధాన కార్యదర్శిగా దాసరి సునీల్, ఉపాధ్యక్షులుగా రాధాకృష్ణ, రాజశేఖర్, రామకోటిరెడ్డి, సహాయ కార్యదర్శులుగా రవికుమార్, సుధాకర్, శైలజ, కోశాధికారిగా యేసుపోగు కోటిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి చర్యలు

ఒంగోలు సబర్బన్: భారతదేశంలోని గిరిజన వర్గాల సమగ్ర అభివృద్ధిని నిర్ధారించడానికి భారత ప్రభుత్వం ధర్తి అబా జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ (డీఏజేయూఏ)ను ప్రారంభించిందని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు ఆమె శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో కేంద్రం ఈ పథకాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని ముందుకు సాగుతోందని వెల్లడించారు. అందుకోసం 17 లైన్ మంత్రిత్వ శాఖల కలయిక ద్వారా 25 అంశాలపై దృష్టి పెడుతోందన్నారు. ఈ మిషన్ 26 రాష్ట్రాలు, 4 కేంద్రపాలిత ప్రాంతాలను కవర్ చేస్తోందని కూడా వెల్లడించారు.

బెల్లం విక్రయంపై వ్యాపారుల్లో ఆందోళన


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

పెద్దదోర్నాల: ఆరోగ్యంతో పాటు తెలుగు ఆచార సంప్రదాయాల్లో బెల్లం పాత్ర ముఖ్యమైంది. నాటుసారా తయారీలోనూ బెల్లానిది అంతకంటే ముఖ్యమైన పాత్రే ఉండటంతో సారా తయారీదారులకు అవస్థలు తప్పడం లేదు. ముఖ్యంగా నల్లమల అభయారణ్యంలో నాటుసారా ప్రభావం ఎక్కువగా ఉండటంతో ఎక్సైజ్ అధికారులు మండలంలోని పలు విక్రయ కేంద్రాల్లో బెల్లం అమ్మకాలపై దృష్టి సారించారు. దీంతో పాటు మండల కేంద్రమైన పెద్దదోర్నాలలోని వ్యాపారులతో పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించి నాటుసారా తయారీ చట్ట విరుద్ధం అంటూ వ్యాపారులతో ర్యాలీలు సైతం నిర్వహించారు. సారా తయారు చేస్తే శిక్షలు ఎంత కఠినంగా ఉంటాయో అన్న విషయంపై అవగాహన కల్పించే కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నారు. గతంలో మండల పరిధిలోని నల్లగుంట్ల, బందంబావి, తిమ్మాపురం, తుమ్మలబైలు, మర్రిపాలెం, చిలకచర్ల తదితర అటవీ ప్రాంతాల్లో జోరుగా నాటుసారాను తయారు చేసి విక్రయాలు కొనసాగించేవారు. ఎక్సైజ్, పోలీస్ అధికారులు సమన్వయంతో నిరంతరంగా సారా తయారీ కేంద్రాలపై దాడులు జరపటంతో సారాతయారీ ఇప్పుడిప్పుడే తగ్గుముఖం పట్టే సూచనలు కనబడుతున్నాయి. దీంతో పాటు అధికారులు బెల్లం విక్రయాలపై నిఘా పటిష్టం చేయడంతో వ్యాపారులు బెల్లం అమ్మేందుకే జంకుతున్నారు. అధికారులు బెల్లం అమ్మకాలపై గ్రామాల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంతో నిత్యావసర వస్తువుగా ఉన్న బెల్లం విక్రయాల సమయంలో వ్యాపారులకు వేధింపులు ఎక్కువ కావటంతో పాటు అధికారులు తమను దొంగల్లా చూస్తున్నారని వ్యాపారులు వాపోతున్నారు.

> **సారా తయారీదారులకు బెల్లం అమ్మితే చర్యలు**
>
> బెల్లం నిత్యావసర వస్తువు కావడంతో ప్రజల అవసరాలకు సరిపడా బెల్లాన్ని స్వేచ్ఛగా విక్రయించుకోవచ్చు. సారా తయారీదారులకు మాత్రం అమ్మకాలు చేయకూడదు. అలా చేస్తే శిక్షలు కఠినంగా ఉంటాయి. తరుచూ ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసే వారిని గుర్తించి అధికారులకు సమాచారమివ్వాలి. సారా తయారీదారులపై నిరంతరం నిఘా ఉంటుంది. హోల్‌సేల్ వ్యాపారులు బెల్లం అమ్మకాలపై ప్రతి 15 రోజులకు ఒకసారి నివేదికలు అందజేస్తున్నారు. ప్రస్తుతం నల్లమల అభయారణ్యం పరిధిలో నాటుసారా తయారీ అదుపులో ఉంది.
>
> – ముక్కు వెంకటరెడ్డి, ఎక్సైజ్ సీఐ, మార్కాపురం

పత్తిలో రసం పీల్చే పురుగులను నివారించాలి

తాళ్లూరు: వేసవిలో సాగు చేసిన పత్తి పంటపై రసం పీల్చే పురుగుల ప్రభావం అధికంగా ఉంటుందని వ్యవసాయాధికారి బి. ప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని లక్కవరం, దోసకాయలపాడు గ్రామాల్లో శుక్రవారం పత్తి పంట సాగు చేసిన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసం పీల్చే పురుగుల పట్ల నివారణ కోసం ఇమిడా క్లోప్రిడ్ 0.4 మిలీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రా లీటర్ నీటిలో అవసరాన్ని బట్టి పిచికారీ చేయాలన్నారు. తెల్లదోమ ఆశించినప్పుడు పైరి ప్రాయిడ్ మందు వాడాలన్నారు. మండల వ్యవసయాధికారి బి.ప్రసాదరావు, వీఏఏ భార్గవి పాల్గొన్నారు.


పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పలు గూడేల్లో ఎక్సైజ్‌శాఖ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. నల్లగుంట్ల, పెద్దమంతనాల, పనుకుమడుగు తదితర గ్రామాల్లో పాత నిందితుల గృహాలను తనిఖీ చేసినట్లు ఎక్సైజ్ సీఐ ముక్కు వెంకటరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో తనిఖీలు నిర్వహించి మద్యం అమ్ముతున్న ఐనేని వెంకట నారాయణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం

- కాలువపై నిర్మించని మూత

పెద్దారవీడు: మండలంలోని దేవరాజుగట్టు జాతీయ రహదారి పక్కన నిర్మించిన కాలువకు మూత వేయక పోవడంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. దేవరాజుగట్టు గ్రామం జంక్షన్‌లో పెద్ద బ్రిడ్జి నిర్మించారు. బ్రిడ్జి పక్క నుంచి సర్వీసు రహదారిపై మార్కాపురం, గిద్దలూరు, ఒంగోలు, వైఎస్సార్ కడప తదితర ప్రాంతాల నుంచి హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, మాచర్ల, తదితర సుదూర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు, భారీ లారీలు, కారులు, ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. పెద్ద బ్రిడ్జి నుంచి సర్వీసు రోడ్డు పక్కన ఎస్సీ కాలనీ ఆనుకొని ఉంది. దాని పక్కన పెద్ద కాలువ నిర్మించారు. కాలనీ భవనం దగ్గర తప్ప మిగతా చోట్ల కాలువపై సిమెంట్ దిమ్మెలతో మూతలు వేశారు. కాలువలో స్థానికులు చెత్తా చెదారం వేయడంతో పూడి పోతోంది. చిన్నారులు ఆటలు ఆడుకునేటప్పుడు లోతైన కాలువలో పడి ప్రమాదానికి గురవుతారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో ఈ రహదారిపై ప్రయాణించే వాహనదారులను ఆ దేవుడే కాపాడాల్సిన పరిస్థితి నెలకొంది. లోతైన కాలువ కనిపించడం లేదని, వాహనాలు నడపాలంటే భయం భయంగా ఉందని డ్రైవర్లు వాపోతున్నారు. సంబంధిత అధికారులు కాలువపై సిమెంటు దిమ్మెలు వేయాలన్న ఆలోచన రాకపోవడంపై వాహనదారులు, స్థానికులు మండిపడుతున్నారు. లోతైన కాలువ వద్ద ఏ మాత్రం ఏమార్చినా ప్రమాదం నెలకొనే ఆస్కారం లేకపోలేదు. వాహనచోదకులు, పాదచారులకు ఈ కాలువ ప్రమాద ఘంటికగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదం జరగక ముందే కాలువపై సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.


దేవరాజుగట్టు జంక్షన్‌లో తారు రోడ్డు పక్కన కాలువ ఇలా..